కాలి బాటలు.. బహుళ ప్రయోజనాలు

- యాజమాన్య పద్ధతులు సులభం
- చీడపీడల బెడద తగ్గుతుంది
- మండల వ్యవసాయశాఖ అధికారి సూచనలు

ముప్పాళ్ల: ప్రస్తుతం ఖరీఫ్ వరి సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారాయి. నాట్లు దగ్గరగా వేయడం వల్ల పంట ఎదిగేటప్పుడు సరైన గాలి, తేమ లేకపోతే చీడపీడలకు అనుకూలంగా మారుతాయి. సుడిదోమ ఆశిస్తే చేను పూర్తిగా పాడైపోతుంది. తెగుళ్ల బెడదను తగ్గించుకోవడానికి కాలి బాటలు ఎంతగానో ఉపయోగపడతాయి. వాటి వలన సాగు నీరు వెళ్లేందుకు సులభమవుతుంది. పంటకు తగిన గాలి, వెలుతురు, సూర్యరశ్మి, ఉష్ణోగ్రత పుష్కలంగా లభిస్తే చీడపీడలకు ప్రతికూల వాతావరణం పెరుగుతుంది. దోమ పోటును అదుపు చేయవచ్చు. మొక్క సామర్థ్యం పెరుగుతుంది. రైతులు వరి నాట్లు వేశాక కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. వరిలో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల్లో ఒక ముఖ్యమైన పని వరిలో కాలి బాటలు తీయడం. వరిలో ఈ బాటలు ఏ సమయంలో ఏ విధంగా తీయాలి, వాటి వలన కలిగే ప్రయోజనాలను మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి పలు సూచనలు అందిస్తున్నారు.

10–15 రోజులలోపు బాటలు తీయాలి..

వరి నాటిన 10–15 రోజులలోపు బాటల తీయడం మంచిది. ఇంతకన్నా ముందుగానే బాటలు తీస్తే మొక్కలు లేచిపోవటం జరుగుతుంది. 10–15 రోజులు తర్వాతే మొక్కలు గట్టిగా ఉండి తెగిపోయే అవకాశం ఉంది. మడిలో నీటి మట్టం 3–5 సెంటీమీటర్లు ఉన్నప్పుడే బాటలు తీయాలి. బాటలు తీసేందుకు మడి పొడవును బట్టి తాడు తక్కువ



గొల్లపాడలో కాలి బాటలు వదిలిపెట్టి నాట్లు వేస్తున్న కూలీలు

మందం ఉండే విధంగా చూసుకోవాలి. తాడును మడికి ఆ గట్టున ఒకరు ఈ గట్టున మరొకరు పట్టుకొని తాగి చివరలు పుల్లకు కట్టి ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటను తీయాలి. దీని వలన బాటల మధ్యలో కోత సమయంలో 3 నుంచి 4 ఓదెలు సమాన పనలుగా పడి త్వరగా ఎండిపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా కాలిబాటలను మడికి గాలివాటంగా తీయాలి. దీని వలన మడిలో గాలి, సూర్యరశ్మి ఎక్కువ ప్రవేశిస్తుంది.

ఎరువులు చల్లేందుకు...

వరిలో బాటలు తీయకుండా వంకర తింకరగా మడిలో నడిచి ఎరువు వేసేటప్పుడు మొక్కల్ని తొక్కడం, ఎరువు సరిగ్గా పడక మొక్కకు అందకపోవడం వంటి నష్టాలు ఉన్నాయి. తీసిన కాలి బాటలో నడుస్తూ ఎరువులు చల్లటం వల్ల చేలో అన్ని దుబ్బులకు సమానంగా పడటమే కాకుండా ఎరువు ఆదా అవుతుంది. అదే విధంగా కలుపు తీసేందుకు సులభంగా ఉంటుంది.

సస్యరక్షణలో...

పంటకు తెగులు ఆశించినప్పుడు పురుగు మందు పిచికారీ చేసుకునేందుకు సులువుగా ఉంటుంది. పొలం మధ్యలోకి వెళ్లి తెగులు సోకిన ప్రాంతాన్ని పరిశీలించుకోవచ్చు. ఆ మేర సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుంటుంది. పంట కోతదశలో అపరాలు చల్లుకోవడానికి కాలిబాటలు ఉపయోగపడతాయి. పంట కోత సులభతరంగా ఉంటుంది.

కాలిబాటలు తీసుకుంటే మేలు.



వరి సాగు చేసే రైతు తప్పనిసరిగా కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే ఎంతో మేలు. గత కొంతకాలంగా ఎక్కువమంది నాటు వేసే సమయంలోనే ముందస్తుగానే కాలిబాటలు వదిలిపెట్టి నాట్లు వేసుకుంటున్నారు. ఇది మంచి పద్ధతి. మొక్కల పిలకలు బాగా దుబ్బు చేయడానికి సహాయపడతాయి. ఈ విధానం వలన పొలంలో పురుగుమందు పిచికారీకీ, పొలంలో తిరిగేందుకు, మొక్కను పరిశీలించేందుకు ఎంతో సులువుగా ఉంటుంది. కలుపు, కోత, కుప్పలు అన్ని దశల్లోను ప్రయోజనకరంగా ఉంటుంది.

–ఎస్.శ్రీధర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, ముప్పాళ్ల

మంచి గాలి, వాతావరణానికి....

వరి చేలో బాటలు తీయడం వల్ల ఎక్కువ గాలి వరి పైరులోకి ప్రవేశించి దుబ్బులకు అధిక ఆక్సిజన్ అందిస్తుంది. దీనివల్ల మొక్కలలో కిరణజన్య సంయోగక్రియ బాగా జరిగి మొక్కలు పచ్చదనంతో నిండి అధిక దిగుబడులిచ్చే అవకాశాలున్నాయి. వరి ఎక్కువ దుబ్బు కట్టడానికి అవకాశం ఉంటుంది.



వరి నారుమడి

క్లుప్తంగా

ఆంధ్రకేసరికి డాక్టర్ గజ్జల నివాళి



నరసరావుపేట: స్వాతంత్ర సమర యోధులు, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి నివాళులు అర్పించారు. శనివారం టంగుటూరి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు.

స్వామిత్వ సర్వే పరిశీలన



నకరికల్లు: గ్రామీణ ప్రాంతాల్లోని గృహాలకు, నివాస గృహాలకు శాశ్వత హక్కుపత్రాలు మంజూరు చేసేందుకు స్వామిత్వ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని డీఎల్‌డీఓ వై.రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా నకరికల్లులో శనివారం చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. గ్రామ మ్యాప్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి నిర్దేశించిన వివరాలు సేకరించాలన్నారు. నిర్ణీత గడువులోగా సమగ్ర వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అందుకూరులో రీసర్వే గ్రామసభ



అందుకూరు(క్రోసూరు): రీ సర్వే కార్యక్రమం పూర్తి చేసుకున్న మండలంలోని అందుకూరులో శనివారం గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ వి.వి.నాగరాజు మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 1936.30 ఎకరాల భూమికి సంబంధించి రీసర్వే కార్యక్రమం పూర్తిచేసినట్లు తెలిపారు. వీటిలో 1739.10 ఎకరాలు ప్రైవేటు భూమి, 197.20 ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించటం జరిగిందన్నారు. 1635 మంది రైతులు సాగులో ఉన్నారని అన్నారు. వీరందరి పేర్లు, సర్వే నంబర్లు సచివాలయంలో ప్రకటించినందున అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేసుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ప్రభుత్వం హద్దు, రాళ్ల పాతటం, పాస్ పుస్తకాల పంపిణీ చేస్తుందని తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు, ఆర్ఐ వెంకట్రావు, విలేజీ సర్వేయర్ జగదీశ్వర రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

స.హ.చట్టం సామాన్యుల చేతిలో ఆయుధం



నకరికల్లు: సమాచార హక్కు చట్టం సామాన్యుల చేతుల్లో ఆయుధం లాంటిదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ముజావర్ జాన్ అహ్మద్ అన్నారు. సమాచారహక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నకరికల్లు మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ అహ్మద్ మాట్లాడుతూ 2005లో అమల్లోకి వచ్చిన సమాచార హక్కుచట్టం ఎందరో సమస్యల పరిష్కారానికి దోహదపడిందన్నారు. గ్రామీణస్థాయి ప్రజానీకానికి చట్టం ఉపయోగపడాలంటే క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కమిటీ సభ్యులకు సూచించారు. పీడిత, బాధిత ప్రజలకు అండగా నిలిచి చట్టం ద్వారా వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మండల కమిటీ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటగిరి, ఉపాధ్యక్షుడు బద్దుల నాగేశ్వరరావు, కార్యదర్శి విశ్వేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ బి.ఎస్.రెడ్డి, ట్రెజరర్ మడకా వెంకటేశ్వర్లు, ముజావర్ వలి, షేక్ మౌలాలి, స్వర్ణ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పోటీ తత్వం అలవడుతుంది

చిలకలూరిపేట: క్రీడలతో ఆరోగ్యంతో పాటు పోటీతత్వం అలవడుతుందని ఏఎంజీ హైస్కూల్ హెచ్‌ఎం బి కృపాదానం చెప్పారు. మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఏఎంజీ హైస్కూల్‌లో శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ విశేషమైన క్రీడా ప్రతిభతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు తెచ్చారని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు.

నేడు శిశుమందిర్‌లో అష్టావధానం

సత్తెనపల్లి: స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఈనెల 24న సాయంత్రం 5.30 గంటలకు అష్టావధానం జరుగుతుందని స్వామి వివేకానంద చైతన్య భారతి అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీధర్ శనివారం తెలిపారు. బ్రహ్మశ్రీ ఉప్పల దడియం భరత్ శర్మచే జరిగే అష్టావధానానికి సంచాలకులు బ్రహ్మశ్రీపోలూరి వెంకట శివ రామ ప్రసాద్‌రావు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరు గ్రామంలోని ఎంపీపీ మెయిన్ పాఠశాలలో శనివారం స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, ఎంఈఓలు జి.కృష్ణ, ఎం.గణేష్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో మొక్కలు నాటటం వలన మంచి వాతావరణంలో విద్యాబోధన జరుగుతుందన్నారు. అందుకని స్వచ్ఛంద సంస్థలు పాఠశాలలను దృష్టిలో ఉంచుకుని మొక్కలు నాటి వాటి, రక్షణ గార్డులు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.రాఘవ, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్‌కే హుస్సేన్, క్లస్టర్ చైర్మన్ యోగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆరిఫ్, ఫైయాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

క్రోసూరు: మండలంలోని తెల్లరేషన్ కార్డుదారులందరికీ, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ త్వరలో స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తామని తహసీల్దార్ వి.వి.నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఎన్ని కార్డులు వచ్చాయి, ఎప్పటి నుంచి ఇచ్చేది త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

రాజుపాలెం: మండలంలోని పలువురు క్రైస్తవ సంఘ కాపరులు తోటి సంఘ సేవకురాలైన బి.అన్నమ్మకు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. కొండమోడు వీరమ్మ కాలనీలో గల కృపా ప్రార్థనా మందిరంలో బి.అన్నమ్మ సేవకురాలుగా పనిచేస్తుంది. శస్త్ర చికిత్స నిమిత్తం ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా చైర్మన్ నందమూరి క్రిష్టర్ చేతుల మీదుగా రూ.6500ల చెక్కును ఆమెకు అందజేశారు. జిల్లా కమిటీ సభ్యులు, సంఘ కాపరులు టి.రత్నం, సతీష్‌కుమార్, మండల పాస్టర్స్ ఫెలోషిప్ కన్వీనర్ జి.ఎస్.ఆర్.రెడ్డి, జె.రవింద్ర, కె.సామియేలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల పరిరక్షణకే అట్రాసిటీ చట్టం



సమావేశంలో మాట్లాడుతున్న ప్యానల్ న్యాయవాది శ్రీనివాసరావు

సత్తెనపల్లి: షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల వ్యక్తుల, ఆస్తులు, ప్రాణ, మాన పరిరక్షణకే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పని చేస్తుందని ప్యానల్ న్యాయవాది డి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్‌జడ్జి (సీనియర్‌డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ చట్టంపై ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు పట్టణంలోని మాస్టిన్ పేటలో జ్యోతి ఫౌండేషన్ హాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా ఉన్న హక్కులు, అన్యాయం జరిగితే ప్రత్యేక న్యాయస్థానం ఉన్న అంశాన్ని తెలియపరిచారు. మరో ప్యానల్ న్యాయవాది బి.ఎల్.కోటేశ్వరరావు ఉచిత న్యాయసహాయం గురించి తెలియజేశారు. చాలావరకు ఈ ప్రత్యేక చట్టం వచ్చిన తర్వాత గతంలో ఉన్న వేధింపులు దాదాపు తగ్గాయన్నారు. పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని, జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న హెచ్‌ఎం మాధవీలత

సత్తెనపల్లి: ప్రతి విద్యార్థిని హెచ్ఐవీ గురించి అవగాహన కలిగి ఉండాలని, డ్రగ్స్ వినియోగం చట్ట రీత్యా నేరమని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం మాధవీలత అన్నారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ, హాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఐవీ/ ఎయిడ్స్, మత్తు పదార్థాల వినియోగ విరమణపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడారు. హాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు ప్రతినిధులు నాగలక్ష్మి, జ్యోతి, ఈశ్వర్‌లు ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వహిస్తున్న 2 నెలల ఐఈసీ ప్రోగ్రాం గురించి వివరించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ యాక్ట్ 2017, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పీఈలు ప్రసన్న, విజయకుమారి, లక్ష్మిబాయి, నాగూర్, శాంతి కుమారి, సుజాత, పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



కోటనెమలిపురి జెడ్పీహెచ్‌ఎస్‌లో మాట్లాడుతున్న వైద్యులు



ముప్పాళ్ల పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

రాజుపాలెం: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కోటనెమలిపురి జెడ్పీ హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. పాఠశాలలో మొక్కలు నాటారు. డాక్టర్ ఎ.అచ్చమ్మ, హెచ్‌ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు జయశ్రీ, హనుమంతరావు, ఆంజనేయులు, పెద్దమ్మాయి, శాంతి, ప్రియదర్శిని, వసంతరావు, సీహెచ్‌ఓలు శారదా, ఏఎన్‌ఎమ్‌లు మరియమ్మ, సైదమ్మ, సుజాత, మున్నిరాబేగం తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ళ: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేర ప్రభుత్వ కార్యాలయాల్లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ కె.నగేష్, డిప్యూటీ తహసీల్దార్ బాలవెంకటేష్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎస్‌కే దస్తగిరి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలను చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి 2.50 లక్షల మంది మహిళలని పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శనివారం నిర్వహించిన స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అక్కా, చెల్లమ్మలను సామాజికంగా, ఆర్థికంగా పైకి తీసుకువచ్చి వారి కాళ్లపై వాళ్లు సొంతంగా వ్యాపారాలను చేసుకుని ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. సభలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

తిట్ల పురాణం.. కుర్చీలు కరవు

వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో స్త్రీ శక్తి విజయోత్సవ సభను పురస్కరించుకొని వేదిక పైకి నామినేటెడ్ పదవి కలిగిన మహిళను ఆలస్యంగా పిలవడంతో ఆమె భర్త తిట్ల పురాణం అందుకున్నాడు. నిర్వాహకులుగా వ్యవహరిస్తున్న ఇరువురు మహిళలను ప్రొటోకాల్ ప్రకారం పిలవడం తెలియదా అంటూ అసభ్యకరంగా దూషించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వ్యవహారం రచ్చగా మారడంతో వెంటనే కొందరు జోక్యం చేసుకొని తర్వాత మాట్లాడుదామంటూ బుజ్జగించారు. ఇది ఇలా ఉంటే సరిపడా కుర్చీలు సైతం వేయకపోవడంతో మహిళలు కొంత అసౌకర్యానికి గురై ఇబ్బందులు పడ్డారు.

నిల్వ నీటిలో దోమలు వృద్ధి



తాలూకా సెంటర్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనందకుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఆగస్టు నెలకు ప్రకటించిన థీమ్ మాన్ సూన్ – హైజీన్ కార్యక్రమాన్ని పట్టణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి తాలూకా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి తాలూకా సెంటర్‌లో మానవహారం చేపట్టి స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు వర్షా కాలంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు గృహాలను, ఇంటిని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తరచుగా చేతులు 20 సెకన్ల పాటు సబ్బుతో శుభ్రపరుచుకోవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయ సారధి, మలేరియా సిబ్బంది, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రిలు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి సంతాపం

అమరావతి: అఖిలభారత సీపీఐ మాజీ కార్యదర్శి, పార్లమెంట్ మాజీ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతికి సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు ఆధ్వర్యంలో పలువురు నేతలు శనివారం సంతాపం వ్యక్తం చేశారు. సూరిబాబు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించి దోపిడీ లేని కార్మిక రాజ్యం స్థాపన కోసం విద్యార్థి దశనుంచే ఏఐఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమాలు నడిపి అంచలంచెలుగా జాతీయ కార్యదర్శిస్థాయి వరకు ఎదిగిన కమ్యూనిష్టు దిగ్గజం సురవరం అని అన్నారు. ఉమ్మడి ఏపీ నుంచి రాష్ట్ర కార్యదర్శిగా రెండుసార్లు, పార్లమెంటు సభ్యులుగా స్టాండింగ్ కమిటీ సభ్యులుగా అనేక ఉన్నతమైన పదవులు చేస్తూ నిస్వార్ధంగా, నిజాయితీగా ప్రజాసమస్యలపై పోరాటం సాగించిన గొప్ప కమ్యూనిస్టు నేత అన్నారు. వివిధ ప్రజాసంఘాల నేతలు సయ్యద్ మెహదీన్ వలి, ఎం.సుబ్రహ్మణ్యం, నండూరి వెంకటేశ్వరరాజు, ఎస్.రాజకుమార్ తదితరులు కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి మృతికి సంతాపం తెలియచేశారు.

డీఎస్సీలో నాగశ్రీవల్లికి ఫస్ట్ ర్యాంక్

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ–2025 ఫలితాలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థిని ఎ.నాగశ్రీవల్లి గణిత శాస్త్రంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఫస్ట్ ర్యాంక్ సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈసందర్భంగా కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగశ్రీవల్లిని అభినందించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ వై.యోగేశ్వరరావు, టీపీఓ ఎం.బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చట్టాలను దుర్వినియోగం చేయకండి

రొంపిచర్ల: చట్టాలను ఎలాంటి పరిస్థితుల్లో దుర్వినియోగం చేయరాదని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మధుస్వామి అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో మండల న్యాయసేవా కమిటీ నరసరావుపేట ఆధ్వర్యంలో శనివారం ఎస్సీ, ఎస్టీ గృహహింస చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. చట్టాలను దుర్వినియోగం చేయరాదన్నారు. నిజంగా అన్యాయం జరిగితే ఫిర్యాదు చేయాలని సూచించారు. అనవసర కేసుల వల్ల కుటుంబాలు బలైపోతాయన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కోసం మండల న్యాయ సహాయ కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బండి నిర్మల, ఎంపీడీవో మ్యాథ్యూబాబు, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ మునికృష్ణ, ఎంఈవో పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో న్యాయవాదుల రాష్ట్ర మహాసభలు

వినుకొండ : గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిర్‌లో ఈ నెల 30,31 తేదీల్లో నిర్వహించే ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వినుకొండ న్యాయవాద సంఘం అధ్యక్షులు మీసాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక అసోసియేషన్ భవనం నందు మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పి.జె.లూకా మాట్లాడుతూ దేశ ప్రజలందరికి సకాలంలో సత్వర న్యాయాన్ని అందరికి అందించడం లక్ష్యంగా ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు గౌస్‌మొహిద్దీన్‌ఖాన్, రమణరెడ్డి, శేఖర్‌బాబు, శివశంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశనుంచే సేవా భావం అలవర్చుకోవాలి

చిలకలూరిపేట: విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలని ఇంటరాక్ట్ క్లబ్‌ల రీజినల్ చైర్మన్ ఆలంగార్ మోహన్ చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో పట్టణంలోని జీవీఐటీ, బ్రిలియంట్, హీలియస్ పాఠశాలల్లో ఆయా పాఠశాలల విద్యార్థులతో మూడు ఇంటరాక్ట్ క్లబ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం అలవాటు చేసేందుకు ఇంటరాక్ట్ క్లబ్‌లను ఏర్పాటు చేసి వారిని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నట్లు చెప్పారు. చిననాటి నుంచే ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకుంటే సమాజంలో సమస్యలు సమసిపోతాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ప్రాంగణాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు బోనం వెంకటేశ్వరరావు, కార్యదర్శి దోరడ్ల మనోజ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

నాదెండ్ల: జాతీయ రహదారి పక్కనే గణపవరం గ్రామంలో కొలువైయున్న ఆంజనేయ ఉపాసకులు అచల దాసునాయన సద్గురు మఠం ఈ నెల 24 ఆదివారం నుండి ప్రతి ఆదివారం ఆలయంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు వేదాంత పరిచయం, భగవద్గీత అంతరార్థం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి కటారు దాసునాయన చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేయనున్న మఠాధిపతులతో కార్యక్రమం నిర్వహించనున్నారు.